ప్రజాశక్తి
శనివారం 20 డిసెంబర్ 2025
5
అల్లూరి సీతారామరాజు



### తాగునీటి బోరుకు మరమ్మతులు

ప్రజాశక్తి -అనంతగిరి: మండలంలోని తాడిగూడ గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు స్థానిక సీపీఎం సర్పంచ్ సోమెల రూతు చొరవ తీసుకుని మరమ్మతు పనులు చేపట్టారు. సోలార్ ప్లాంటేషన్‌కు సంబంధించిన బోరు మోటార్ కనెక్షన్ గత కొన్ని రోజుల క్రితం పాడైపోవడంతో తాగునీటి సరఫరా నిలిచిపోయిందన్నారు. ఈ సమస్యను గ్రామస్తులు సర్పంచ్ దృష్టికి తీసుకువెళ్లగా, వెంటనే స్పందించిన సర్పంచ్ శుక్రవారం మరమ్మత్తు పనులు చేపట్టారు.మోటార్ మరమ్మతులు పూర్తయ్యాక గ్రామానికి తిరిగి తాగునీటి సరఫరాను ప్రారంభించారు. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు ఎస్. నాగులు, వార్డు సభ్యులు చిన్నయ్యతో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.



మరమ్మతు చేపడుతున్న సిబ్బంది

## ‘ఉపాధి హామీ’ సవరణలపై...
# సిపిఎం నిరసనల వెల్లువ



అరకులోయలో నిరసన చేపడుతున్న సురేంద్ర, నాయకులు



పాడేరులో ఆందోళన చేస్తున్న అప్పలనర్స తదితరులు

**ప్రజాశక్తి-పాడేరు:** కేంద్రంలోని మోడీ ప్రభుత్వం గ్రామీణ పేదల జీవనాధారమైన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎంజీఎన్ఆర్ఈజీఏ) స్థానంలో పలు మార్పులు చేసి 'వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్ (గ్రామీణ్)' (వీబీ-జీ రామ్ జీ) బిల్లు-2025ను తీసుకొచ్చిందని సిపిఎం అల్లూరి జిల్లా కార్యదర్శి పి అప్పలనరస విమర్శించారు. కేంద్ర ప్రభుత్వాన్ని వ్యతిరేకిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కేంద్రం పాడేరులో సిపిఎం నిరసన నిర్వహించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మహాత్మా గాంధీ పేరును తొలగించడమే కాకుండా, ఉపాధి హామీ హక్కును నీరుగార్చి, డిమాండ్-డ్రివెన్ పథకాన్ని సప్లై-డ్రివెన్ స్కీమ్‌గా మారుస్తున్నారన్నారు. ఈ నిరసనలో సిపిఎం జిల్లా నాయకులు ఎల్. సుందరరావు, దాస్ పాల్గొన్నారు.

**ముంచింగిపుట్టు :** ఉపాధి హామీ సవరణపై ఆదివాసి గిరిజన సంఘం, సిపిఎం నేతలు మండలంలో నిరసన కార్యక్రమాన్ని శుక్రవారం చేపట్టారు. గుమ్మ సిరగంపుట్టుతో పలు గ్రామాలలో నిర్వహించారు. ఆదివాసి గిరిజన సంఘం మండల అధ్యక్షుడు ఎం ఎం శ్రీను మాట్లాడుతూ, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ పాలన విధానాలు రాజ్యాంగానికి విరుద్ధంగా వ్యవహరిస్తున్నాయని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు ఆనందరావు, ఎంఎం దేవన్న, నర్సింగరావు, తిరుపతిరావు, సిపిఎం నాయకులు పాల్గొన్నారు.

మండలంలోని అసరాడ గ్రామం జంక్షన్ వద్ద సిఐటియు కార్యదర్శి శంకర్రావు ఆధ్వర్యంలో నిరసన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పని దినాలు 125 రోజులకు పెంచినట్లు ప్రభుత్వం చెబుతున్నా దీనికి తగ్గ నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ మేట్స్ సొంద రఘు, కె గంగాధర్, పీసా కార్యదర్శి, పి.సింగ్రు, కె రాజు, పి.రామ్ దాస్, కె.జగనత్, పి.జైరాం, పి గోపాల్ పాల్గొన్నారు.

**హుకుంపేట :** మండలంలోని పలు గ్రామాల్లో సిపిఎం నేతలు నిరసన చేపట్టారు. ఆదివాసీ గిరిజన సంఘం మండల కార్యదర్శులు టి.కృష్ణారావు, కె.అప్పారావు ఆధ్వర్యంలో అడ్డుమండ పంచాయితీ సన్యాసమ్మపాలెం, సీపీఎం మండల కార్యదర్శి వి.లక్ష్మణరావు ఆధ్వర్యంలో రంగసింగపాడులో నిరసనలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, చట్ట సవరణల పేరుతో కూలీల కడుపు కోతకు కారణమవుతోందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు కొర్ర అప్పారావు, వి.రాంబాబు, పి. మత్స్యరాజు, టి.విశ్వనాథరావు, ఎస్.వెంకట్రావు, జి. బాబూరావు, సోనెబాబు, బొంజుబాబు పాల్గొన్నారు.



చింతపల్లిలో ప్లకార్డులతో నిరసన

**అరకులోయ రూరల్:** ఉపాధి హామీ చట్టాన్ని పేదలకు దూరం చేయడానికి మోడీ ప్రభుత్వం పూనుకుందని, దీంట్లో భాగంగానే సవరణలు చేస్తున్నారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కిల్లో సురేంద్ర విమర్శించారు. శుక్రవారం మండల కేంద్రంలోని మహాత్మా గాంధీ విగ్రహం వద్ద, పద్మాపురం పంచాయితీ దుమ్ముగుడ గ్రామాల్లో నిరసన చేపట్టారు. కిల్లో సురేంద్ర మాట్లాడుతూ, ఉపాధి హామీ చట్టం స్ఫూర్తిని పూర్తిగా దెబ్బతీసేలా మార్పులు చేస్తోందని అన్నారు. ఉపాధిని హక్కుగా కల్పిస్తున్న చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం తన దయా దాక్షిణ్యాలపై ఆధారపడే పథకంగా మార్చేస్తోందని విమర్శించారు.పనిచేసే ప్రాంతాల్లో ప్రమాదాలు జరిగినా, కనీస సౌకర్యాలు లేకున్నా, వేతనాలు ఆలస్యమైనా రాష్ట్ర ప్రభుత్వాలదే బాధ్యత అంటూ కేంద్రం తప్పించుకుంటోందని సురేంద్ర దుయ్యబట్టారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి కిండంగి రామారావు, నాయకులు కొర్రా మగ్గన్న కె.రమేష్, అప్పలస్వామి, కె.సుబ్బారావు, ఉప సర్పంచ్ జన్ని భగత్ రాం, గాసి పాల్గొన్నారు.



హుకుంపేటలో ప్లకార్డులతో నిరసన

**అనంతగిరి :** ఉపాధి హామీ చట్ట సవరణపై మండలంలోని ఎగువశోభ పంచాయితీ జామిగుడ గ్రామంలో సిపిఎం నేత, జెడ్పిటిసి దీసరి. గంగరాజు ఆధ్వర్యంలో గిరిజన రైతులు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ గంగరాజు మాట్లాడుతూ, ఉపాధి హామీ చట్టం స్ఫూర్తిని దెబ్బతీస్తున్న ప్రయత్నాలు ఆపాలన్నారు. ఉపాధిహామీ చట్టాన్ని తుంగలో తొక్కేందుకు కుట్ర పన్నుతుందని, దీనికి వ్యతిరేకంగా పోరాటానికి సన్నద్ధం కావాలన్నారు. కేంద్ర ప్రభుత్వం భరించవలసిన ఉండగా రాష్ట్ర ప్రభుత్వాలపై భారం మోపడం సరికాదని తెలిపారు. ఉపాధి హామీ చట్టం పేరును పేరు మార్చి మతం రంగు పులుముతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు సాగర.రాజు, సోమెల .సుబ్బారావు, పాంగి చిన్నారావు, సాగర.మద్దు, సాగర.రామన్న గిరిజన సంఘం నాయకుడు నరాజీ సురేష్ గిరిజనులు పాల్గొన్నారు.



అనంతగిరిలో మాట్లాడుతున్న గంగరాజు

**చింతపల్లి :** కేంద్రంలోని మోడీ ప్రభుత్వం చేపట్టిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్ట సవరణకు వ్యతిరేకంగా సిపిఎం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు చింతపల్లి పాత బస్టాండ్‌లోని గాంధీ విగ్రహం ఎదుట సిపిఎం కార్యకర్తలు కళ్లకు నల్ల రిబ్బన్లు కట్టుకుని మౌనంగా నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బోనంగి చిన్నయ్య పడాల్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ కుట్రలను ఎదిరించి ఎంజిఎన్ఆర్ఇజిఎను కాపాడుకోవడమే కూలీల ముందున్న ప్రధాన కర్తవ్యమని పేర్కొన్నారు. 2005లో నాటి యుపిఎ-1 ప్రభుత్వంపై వామపక్ష పార్టీల ఒత్తిడితో ఈ చట్టాన్ని తీసుకురావడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు సాగిన చిరంజీవి, మజ్జి రాంబాబు, తంగుల రఘునాథ్, చిన్నారావు పాల్గొన్నారు.

**జికే వీధి:** ఉపాధి హామీ చట్టానికి కేంద్రం చేస్తున్న సవరణలకు నిరసనగా శుక్రవారం జికె వీధి మండలం దేవరపల్లి పంచాయతీలో వ్యవసాయ కార్మికులతో నిరసన తెలిపారు. సిపిఎం జీకే విధి మండల కార్యదర్శివర్గ సభ్యులు గడుతూరి సత్యనారాయణ ఆధ్వర్యంలో కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టబద్ధ హక్కుగా ఉన్న ఈ పథకాన్ని రద్దు చేసేందుకు కేంద్రం చేస్తున్న కుట్రలను సిపిఎం తీవ్రంగా ఖండిస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకురానున్న వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్ గర్ అండ్ అజీవిక మిషన్ (విబి-జి రాంజి) పేరుతో ఉపాధిహామీ పథకానికి నిర్వీర్యం చేయాలని చూస్తున్నారు. పనిహక్కుగా ఉన్న పాతచట్టాన్ని మార్చి సాధారణ పథకంగా అమలు చేయనున్నారు. కార్యక్రమంలో మంగళ పాలెం పీసా కమిటీ కార్యదర్శి శెట్టి నరసింగపాడు వనపల గణేష్ మధు పాల్గొన్నారు.

**రాజవొమ్మంగి:** తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు శుక్రవారం రంపచోడవరం ఐటిడిఎ వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. తొలుత సిఐటియు రంపచోడవరం జిల్లా కార్యాలయం నుండి ఐటిడిఎ వరకూ సిఐటియు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. తమ సమస్యలు పరిష్కరించాలంటూ బిగ్గరగా నినదించారు.ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు శాంతిరాజు మాట్లాడుతూ ఉపాధి చట్టంలో గత 19 సంవత్సరాలుగా ఫీల్డ్ అసిస్టెంట్లుగా విధులు నిర్వహిస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లకు ఇస్తున్న వేతనం రూ 5,745లు అని ఈ వేతనంతో కుటుంబాలను ఎలా పోషించాలని ఆవేదన వ్యక్తం చేశారు. వీరికి కనీసవేతనం రూ 26 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ యూనియన్ నాయకులు మడి శ్రీనుబాబుదొర, కారం రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.




రంపచోడవరం ఐటిడిఎ వద్ద ఆందోళన చేస్తున్న నాయకులు



డొంకరాయి పవర్ కెనాల్ పనులు పరిశీలిస్తున్న అధికారులు

## పొల్లూరు జలవిద్యుత్ కేంద్రంలో పనుల పరిశీలన

**ప్రజాశక్తి-సీలేరు:** సీలేరు కాంప్లెక్స్ పరిధిలోని పోల్లూరు జలవిద్యుత్ కేంద్రంలో జరుగుతున్న 5,6 యూనిట్లు నిర్మాణ పనులు దిగు సీలేరు డొంకరాయి పవర్ కెనాల్ నిర్వహణ పనులు, విజయవాడ విద్యుత్ సౌదా నుంచి వచ్చిన ఏపీ జెన్కో (సి ఈ సివిల్) రవీందర్‌రెడ్డి పరిశీలించారు. ఈ బృందం శుక్రవారం విస్తతంగా పర్యటించారు. సీలేరు కాంప్లెక్స్ ముఖ్య ఇంజనీర్‌తో కలిసి పొల్లూరు జల విద్యుత్ కేంద్రంలో ఏర్పాటు చేస్తున్న 5,6 యూనిట్లుకు నీటిని సరఫరా చేసేందుకు ఏర్పాటు చేస్తున్న డిడి గేట్స్ ,సర్జ్ ట్యాంకు, పెనస్టాక్ పైప్‌లైన్ నిర్మాణ పనులు క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం డొంకరాయి పవర్ కెనాల్ రీచ్ 1, రీచ్ 2 లో జరుగుతున్న నిర్మాణ పనులను పరిశీలించారు. నిర్ణీత వ్యవధిలో పనులు పూర్తి చేయాలని గుత్తేదారులకు ఆదేశించారు. కెనాల్ నిర్మాణపు పనుల్లో ఎటువంటి నాణ్యత లోపాలు లేకుండా అధికారుల పర్యవేక్షణ జరగాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎపి జెన్కో విద్యుత్‌సౌదా ఎస్ఇ సివిల్ శ్రీనివాసరెడ్డి ఇఇలు శ్రీనివాస్, బాలకృష్ణ, ఎడిఇ కొండబాబు, ఎఇ పవన్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వక్తలు

## యుటిఎఫ్ మహాసభను జయప్రదం చేయండి

**ప్రజాశక్తి -అడ్డతీగల:** స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో శుక్రవారం యుటిఎఫ్ మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. మండల ప్రధాన కార్యదర్శి కె.వి.రాఘవులు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ముఖ్యంగా ఈ నెల 21న మారేడుమిల్లిలో జరిగే నాలుగో జిల్లా మహాసభలకు అందరూ పెద్ద ఎత్తున వచ్చి జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో మురళీకృష్ణ, శేఖర్‌దొర, అబ్బాయిరెడ్డి, చిన్నారెడ్డి పాపారావు, గౌతమి తదితరులు పాల్గొన్నారు.



మెడికల్ క్యాంప్‌పై సమీక్షిస్తున్న ఎమ్మెల్యే శిరీషాదేవి తదితరులు

## 21న మెగా వైద్య శిబిరం

**ప్రజాశక్తి-రాజవొమ్మంగి:** ఈనెల 21న రంపచోడవరం వైటిసి సెంటర్లో ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్టు రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి, రిటైర్డ్ మాజీ డిజిపి రాజేంద్ర కుమార్ శుక్రవారం తెలిపారు. శుక్రవారం వైద్యశిబిరానికి సంబంధించిన ఏర్పాట్లను పర్యవేక్షించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రంపచోడవరం యూత్ ట్రైనింగ్ సెంటర్లో ఈ నెల 21న ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ ద్వారా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు భార్య భువనేశ్వరి కార్యక్రమానికి హాజరవుతున్నారని తెలిపారు. ఆదివారం ఉదయం 9 గంటల నుండి, సాయంకాలం నాలుగు గంటల వరకూ యూత్ ట్రైనింగ్ సెంటర్లో వైద్యశిబిరం నిర్వహిస్తామన్నారు. క్యాంపు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. వైద్యశిబిరానికి వచ్చిన వారందరికీ భోజన సదుపాయం, త్రాగునీరు సదుపాయం ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.

**వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి**

ఈనెల 21 ఆదివారం ఉదయం 9:30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్టు ద్వారా మెగా మెడికల్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి, రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ యస్.బోజ్జిరెడ్డి, రంపచోడవరం ఐటిడిఎ పిఒ స్మరణ్ రాజ్, రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం నోక్వాల్ శుక్రవారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు

## 21న విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు

**ప్రజాశక్తి -సీలేరు:** జికె వీధి మండలం సీలేరు వివిధ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో సృజనాత్మకను సామాజిక బాధ్యతను పెంపొందించే ఉద్దేశంతో చిత్రలేఖన పోటీలను ఈ నెల 21వ తేదీ ఉదయం 9 గంటలకు ఎపి జెన్కో కల్యాణ మండపంలో కానీ, ఇండోర్ స్టేడియంలో కానీ నిర్వహించనున్నట్టు సీలేరు గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు వెల్లడించారు. ఈ సందర్భంగా పోస్టర్లను శుక్రవారం ఆవిష్కరించారు. అనంతరం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ పోటీల్లో విజేతలకు బహుమతులు అందిస్తామన్నారు. మాదకద్రవ్యాలను నో చెబుదాం కార్యక్రమం ద్వారా విద్యార్థులు డ్రగ్స్ వల్ల కలిగే దుష్పరిమాణాలపై అవగాహన కల్పించి వారి భవిష్యత్తు లక్ష్యాలు ఆశయాలను చిత్రాల రూపంలో వ్యక్తపరిచే అవకాశం కల్పించడమే ముఖ్య ఉద్దేశం అన్నారు. ఎవరికైనా సందేహాలు ఉంటే పూర్తి సమాచారం కొరకు 9949754649, 9441079715 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

## పీసా చట్టంపై అవగాహన

**ప్రజాశక్తి - వై రామవరం:** మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం అంబేద్కర్, గాంధీజీ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ పీసా చట్టం 1996 పై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ బాపన్నదొర మాట్లాడుతూ, గ్రామాభివృద్ధి కోసం, జరుగుతున్న అభివృద్ధి పనులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని, ఏమైనా సమస్యలు ఉంటే, అధికారుల దృష్టికి తీసుకువస్తే సమస్య పరిష్కరిస్తామని అన్నారు. కార్యక్రమంలో సర్పంచులు పంచాయతీ కార్యదర్శులు, సచివాలయం సిబ్బంది, పీసా అధ్యక్షులు పాల్గొన్నారు.

## ఐస్‌క్రీం బండి ఢీకొని బాలునికి గాయాలు


**ప్రజాశక్తి - జికె వీధి :** మండలంలోని రింతాడలో ప్రభుత్వ పాఠశాల లో నాలుగో తరగతి చదువుతున్న మామిడి శైలేష్ అనే విద్యార్థి స్కూల్ విడిచి పెట్టిన సమయంలో ఇంటికి వెళుతుండగా ఐస్‌క్రీమ్ బండి బలంగా ఢీకొట్టడంతో గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న స్కూల్ సిబ్బంది హుటాహుటిన చింతపల్లి ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. తలకి కాళ్ళకి గాయాలు కావడంతో మెరుగైన చికిత్స అందించేందుకు నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు.




ఆందోళన చేపడుతున్న ఎస్ఎఫ్ఐ నేతలు

## పిపిపి విధానాన్ని విరమించాలి
**- ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన నిరసన**

**ప్రజాశక్తి- పాడేరు:** ప్రభుత్వ మెడికల్ కళాశాలల్లో పిపిపి విధానాన్ని అమలు చేసే యోచన ప్రభుత్వం విరమించుకోవాలని, గిరిజన విద్యార్థిని విద్యార్థులకు ఉచితంగా మెడికల్ కళాశాలలో విద్యను అభ్యసించుటకు ప్రభుత్వం పూర్తి బాధ్యత తీసుకోవాలని అల్లూరి జిల్లా ఎస్ఎఫ్ఐ అధ్యక్షులు పాంగి.జీవన్ కృష్ణ, ప్రధాన కార్యదర్శి కార్తీక్ శ్రీను డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని మెడికల్ కళాశాల వద్ద శుక్రవారం పిపిపి విధానంపై ప్రభుత్వాన్ని వ్యతిరేకిస్తూ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ విద్యా సంస్థలన్నింటినీ ప్రభుత్వమే నడిపించాలని నినాదాలు చేశారు. ప్రభుత్వ విద్యా కేంద్రాలన్నిటిని ప్రైవేటు సంస్థల పరం చేయడం సరికాదన్నారు. పూర్తిగా పిపిపి విధానాన్ని వెంటనే రద్దు చేయాలని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను జారీ చేసిన సర్క్యులర్లన్నింటిని వెనక్కి తీసుకోవాలని నాయకులు డిమాండ్ చేశారు. మెడికల్ కాలేజీలను ప్రైవేట్‌పరం చేస్తే ఉద్యమం ఉధృతం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు, జాన్ పడాల్, ఎస్ఎఫ్ఐ మండల కమిటీ సభ్యులు, వెంకట్ విద్యార్థులు పాల్గొన్నారు.




వినతులను స్వీకరిస్తున్న దొన్నుదొర

## సమస్యల పరిష్కారానికి కృషి
**-విజయనగరం జోన్ ఆర్టీసీ చైర్మన్ దొన్నుదొర**

**ప్రజాశక్తి-ముంచింగి పుట్టు ::** మండల కేంద్రంలో శుక్రవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని శుక్రవారం టిడిపి మండల అధ్యక్షురాలు సన్యాసమ్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అరకు అసెంబ్లీ నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్, విజయనగరం జోన్ ఆర్టీసీ చైర్మన్ సియ్యారి దొన్నుదొర పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని నిర్దేశించి ఆయన మాట్లాడుతూ, మండల కేంద్రంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించామని, వీటిని పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. మండల వ్యాప్తంగా ప్రజల నుంచి వచ్చిన అర్జీలలో అత్యధికంగా సిసి రోడ్లు, డ్రైనేజీలు, మంచినీటి, పాఠశాల భవన నిర్మాణాలు ఉన్నాయని వచ్చాయని తెలిపారు. వచ్చిన ఆర్జీలను ఆన్లైన్ ద్వారా ప్రభుత్వానికి సమర్పించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. గ్రీవెన్స్ ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షురాలు కిల్లో సన్యాసమ్మ, కార్యదర్శి జగత్రాయ్, కూటమి నాయకులు గడ్డంగి రామమూర్తి, బలరాం, రామారావు, పవన్, బాపూజీ, లొక్కిరామ్ , కార్యకర్తలు పాల్గొన్నారు.

# యువతకు ఉపాధి కల్పన

### ఐటిడిఎ పిఒ స్మరణ్‌రాజ్

**ప్రజాశక్తి-రాజవొమ్మంగి:** ఏజెన్సీలో చదువుకున్న యువతకు ప్రైవేట్ సెక్టార్‌లో ఉపాధి అవకాశాలు కల్పించేందుకు సంబంధిత అధికారులతో సంప్రదిస్తామని రంపచోడవరం ఐటిడిఎ పిఒ స్మరణ్‌రాజ్ పేర్కొన్నారు. శుక్రవారం రంపచోడవరం స్థానిక డిగ్రీ కళాశాల ప్రాంగణంలోని స్కిల్ డెవలప్‌మెంట్ కార్యాలయాన్ని పిఒ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంబంధిత అధికారులతో సంప్రదించి ఉపాధి అవకాశా కల్పించేందుకు తగు చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల సిబ్బంది పాల్గొన్నారు. ఫోటోరె3. కళాశాల సిబ్బందితో మాట్లాడుతున్న పీవో స్మరణ్ రాజ్.

**వెదురు ఉత్పత్తుల అభివృద్ధికి ప్రోత్సహం**

ఏజెన్సీలో వెదురుతో తయారుచేసిన ఉత్పత్తుల అభివృద్ధిని ప్రోత్సహిస్తున్నట్టు రంపచోడవరం ఐటిడిఎ పిఒ స్మరణ్‌రాజ్ అన్నారు.శుక్రవారం మండలం లోని సూర్లవాడలో గిరిజనులు తయారుచేసిన వెదురు పరికరాలకు సంబంధించిన సమావేశానికి రంపచోడవరం ఐటిడిఎ పిఒ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పిఒ స్మరణ్‌రాజ్ మాట్లాడుతూ ఈ ప్రాంతంలోని గిరిజనులు తయారుచేసిన వెదురు పరికరాలు మైదాన ప్రాంతంలో వెలుగు సంస్థ ద్వారా కొనుగోలు చేసే విధంగా తగు చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. గిరిజనులకు వెదురు పరికరాల తయారీపై అవసరాన్ని బట్టి శిక్షణ ఇవ్వడం జరుగుతుందని ఆయన తెలిపారు. వెదురు పరికరాలను ప్రాజెక్ట్ అధికారి పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.కార్యక్రమంలో వెలుగు ఎపిడి డేగలయ్య, ఎపిఎం జి.కిషోర్, సిబ్బంది రామరాజు తదితరులు పాల్గొన్నారు.



వెదురుతో తయారు చేసిన వస్తువులను పరిశీలిస్తున్న పిఒ స్మరణ్‌రాజ్

## ఎంపిటిసికి పలువురి పరామర్శ



పరామర్శిస్తున్న వైసిపి నాయకులు

**ప్రజాశక్తి- కొయ్యూరు:** కొయ్యూరు మండలం ధర్మవరం గ్రామ సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో డౌనూరు సెగ్మెంట్ ఎంపీటీసీ సభ్యుడు బిడిజాన అప్పారావు తీవ్రంగా గాయపడ్డారు. బైక్‌పై కొయ్యూరు వెళ్తుండగా ఎదురుగా వస్తున్న బైక్ ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు. తీవ్రంగా గాయపడిన అప్పారావును స్థానికులు డౌనూరు పీహెచ్‌కి తరలించారు. మెరుగైన వైద్యం కోసం నర్సీపట్నం ఆసుపత్రికి తరలిస్తున్నట్లు తెలిపారు. వైసిపి నేతలు నర్సీపట్నం ఆసుపత్రిలో ఆయనను శుక్రవారం పరామర్శించారు.

## మంప ఎస్ఐ శంకరరావు బదిలీ

**ప్రజాశక్తి -కొయ్యూరు:** కొయ్యూరు మండలం మంప పోలీస్ స్టేషన్ ఎస్ఐ కే.శంకరరావుకు బదిలీ అయింది. ఆయనను అనంతగిరి పోలీసు స్టేషన్‌కు బదిలీ చేస్తూ అల్లూరి జిల్లా ఎస్పీ అమిత్ బర్దార్ ఉత్తర్వులు జారీ చేశారు. సుమారు 15 నెలల క్రితం ఆయన విశాఖ టూటౌన్ నుంచి మంప ఎస్‌గా బదిలీపై వచ్చారు. ఏడాదిన్నర కాలంలో ఆయన స్టేషన్ పరిధిలోని మారుమూల గ్రామాల్లో పర్యటిస్తూ, ప్రజలతో మమేకమయ్యారు.

## గిరిజన విద్యార్థులకు పుస్తకాలు, పెన్నుల పంపిణీ

**ప్రజాశక్తి - జీకే వీధి :** మండలంలోని మారుమూల గ్రామాల్లో పేద గిరిజన విద్యార్థులకు ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు పుస్తకాలు, పలకలు, , పెన్నులు ఎస్‌రాయవరం మండల పిఅర్‌టియు సంఘం దాతల సహకారంతో పంపిణీ చేశారు. మారుమూల గ్రామాలైన తీములబంధ, కుంకుమపూడి, సాగులు, ఈతరెబ్బల, చీడిగొంది, గ్రామాల్లో చదువుతున్న సుమారు 300 మంది విద్యార్థులకు వీటిని అందించారు.

శుక్రవారం మారుమూల పాఠశాలలను సందర్శించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పిఆర్‌టియు ఆడిట్ కన్వీనర్ గోపినాథ్, విశాఖపట్నం జిల్లా పిఅర్‌టియు అధ్యక్షుడు శ్రీనివాసరావు, స్టేట్ కౌన్సిలర్ కె.మత్స్యలింగం, పిఅర్‌టియు సంఘం అల్లూరి సీతారామరాజు జిల్లా అధ్యక్షుడు యు.వి.గిరి, ఎంఇఒ రామన్నదొర, రాష్ట్ర ఆదివాసీ సంఘం ఉపాధ్యక్షుడు లోచల రామకృష్ణ, గిరిజన ఉద్యోగ సంఘం మండల అధ్యక్షుడు డి.వి కాళేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాలు అందిస్తున్న ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు

## గ్రామసభపై దండోరా వేయాలి



వినతిపత్రాన్ని ఇస్తున్న నాయకులు

**ప్రజాశక్తి-చింతపల్లి :** మండలంలోని చౌడుపల్లి గ్రామపంచాయతీని రెండు గ్రామపంచాయతీలుగా విభజించేందుకు నిర్వహించాల్సిన గ్రామసభపై దండోరా వేయించి ప్రజలకు తెలియజేయాలని ఎపి ఆదివాసీ గిరిజన సంఘం మండల ప్రధాన కార్యదర్శి సాగిన చిరంజీవి డిమాండ్ చేశారు. ఈ మేరకు సంఘం నాయకులు శుక్రవారం సర్పంచ్, పంచాయతీ సెక్రటరీ, ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు. విభజన అంశంపై స్పష్టమైన తేదీ ప్రకటించి దండోరా ద్వారా సమాచారం ఇవ్వాలని ఆ వినతిపత్రంలో కోరారు.

ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ చౌడుపల్లి గ్రామపంచాయతీ సర్పంచ్ గెమ్మెలి లలిత అధ్యక్షతన జరిగిన ఈ గ్రామసభకు కొద్దిమంది వార్డు సభ్యులు, ఓటర్లు మాత్రమే హాజరుకావడంతో విభజనపై నిర్ణయం వాయిదా పడినట్లు చెప్పారు. గ్రామపంచాయతీ విభజన చాలా కీలక అంశంలో నిర్వహించే గ్రామసభకు కనీసం 50 శాతం మంది ఓటర్లు, వార్డు సభ్యులు హాజరు కావాల్సి ఉండగా, తగిన స్థాయిలో పాల్గొనలేకపోవడం, పూర్తి సమాచారం ప్రజలకు చేరకపోవడం వల్ల ఈ గ్రామసభను వాయిదా వేయాలని కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వంతల శ్రీను, సాగిన పడాల్, వంతల చైతన్య, ఈ చిన్నారావు, బుజ్జిబాబు, త్రినాథ్, పలువురు ఓటర్లు పాల్గొన్నారు.

## రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలి



సూపరింటెండెంట్‌తో మాట్లాడుతున్న ఈశ్వరరావు

**ప్రజాశక్తి-చింతపల్లి :** చింతపల్లి ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు మరింత నాణ్యమైన, సమయోచిత వైద్య సేవలు అందించాలని ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు కవడం ఈశ్వరరావు కోరారు. చింతపల్లి ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ ఎం.నీలవేణితో కలిసి ఆసుపత్రిలోని వివిధ వార్డులను శుక్రవారం ఆయన పరిశీలించారు. రోగుల ఆరోగ్య పరిస్థితులను తెలుసుకొని, అందుతున్న చికిత్స, మందుల లభ్యత, సిబ్బంది సేవలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఈశ్వరరావు మాట్లాడుతూ గిరిజన గ్రామాల నుంచి అనేక రకాల వ్యాధులతో బాధపడుతున్న రోగులు చింతపల్లి ఏరియా ఆసుపత్రికి వస్తున్నారని, వారు వచ్చిన వెంటనే ప్రాథమిక చికిత్స అందించి, వారి వైద్య వివరాలను సమగ్రంగా నమోదు చేయాలని సూచించారు. అత్యవసర కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలని, పరీక్షలు, నివేదికల్లో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆసుపత్రి ల్యాబ్ టెక్నీషియన్ అనిల్, వైద్య, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఫిర్యాదుల పరిష్కారంపై శ్రద్ధ వహించాలి

**ప్రజాశక్తి-పాడేరు టౌన్:** ఐటిడిఎలో శుక్రవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదులు అందాయి. జిల్లా ఇంచార్జ్ జెసి, ఐటిడిఏ పిఒ శ్రీపూజ, ఇన్చార్జి డిఆర్ఓ పి.అంబేద్కర్, ఆర్ డిఒ ఎంవిఎస్ లోకేశ్వరరావు, వివిధ విభాగాల జిల్లా స్థాయి అధికారులు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పాల్గొన్నారు. అర్జీదారుల నుండి స్వీకరించిన ఫిర్యాదులను సంబంధిత శాఖ అధికారులకు అందించి త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. జిల్లా అధికారులు, పలు మండలాల తహసీల్దార్లు, ఎంపిడిఒలు, తదితరులు పాల్గొన్నారు.

**పొదుపు సంఘాలకు చెక్కు అందజేత**

జి.మాడుగుల మండలం జి.మాడుగుల గ్రామానికి చెందిన 36 స్వయం సహాయక పొదుపు సంఘాల లబ్దిదారులకు చెక్కును జిల్లా ఇంచార్జ్ జెసి, ఐటిడిఏ పిఒ శ్రీపూజ అందజేశారు. ఐటిడిఏ సమావేశ మందిరంలో శుక్రవారం రూ.2 కోట్ల 50 లక్షల రుణాల మంజూరు చెక్కును లబ్దిదారులకు అందించారు. ఆమె మాట్లాడుతూ లబ్దిదారులు బ్యాంకు ఖాతాలో జమైన నగదును సక్రమంగా, అవసరాలకు అనుగుణంగా వినియోగించు కోవాలన్నారు. సొమ్మును దుర్వినియోగం చేయ కుండా ప్రణాళిక బద్ధంగా వినియోగించుకుంటే తీసుకున్న రుణం నిర్ణీత సమయంలో చెల్లించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి డిఆర్ఒ పి.అంబేద్కర్, ఆర్‌డిఒ ఎంవిఎస్ లోకేశ్వరరావు, డిఆర్‌డిఏ పిడి వి.మురళి, ఇతర అధికారులు, స్వయం సహాయక సంఘ సభ్యులు, పాల్గొన్నారు.



అర్జీదారులతో మాట్లాడుతున్న ఇన్చార్జి జెసి శ్రీ పూజ,

# ఔషధ పరిశోధన, ఉత్పత్తిలో భారత్ కీలకం

### శాంత బయోటెక్ వ్యవస్థాపకుడు డాక్టర్ వరప్రసాదరెడ్డి
### గీతంలో 13వ 'లాసా' అంతర్జాతీయ సమావేశాలు



సదస్సు సావనీరు ఆవిష్కరిస్తున్న అతిథులు

**ప్రజాశక్తి -మధురవాడ :** ఔషధ పరిశోధన, ఉత్పత్తిలో అంతర్జాతీయంగా భారత్ కీలకపాత్ర పోషిస్తోందని శాంత బయోటెక్ వ్యవస్థాపకుడు డాక్టర్ వరప్రసాదరెడ్డి అన్నారు. శుక్రవారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం వేదికగా లేబొరేటరీ యానిమల్ సైంటిస్ట్స్ అసోసియేషన్ (లాసా) 13వ అంతర్జాతీయ సమావేశాలను ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ నాణ్యతతో కూడిన ఔషధాలు మానవాళికి అందాలంటేనైతిక విలువలు, ఉన్నత ప్రమాణాలను పాటిస్తూ ఔషధ పరిశోధనలు జరగాలన్నారు.. ఔషధ ప్రయోగాలకు జంతువులకు ప్రత్యామ్నాయ పరిజ్ఞానంపై పరిశోధకులు దృష్టిసారించాలని సూచించారు. గీతం ఛాన్సలర్ ప్రొఫెసర్ వీరేంద్రసింగ్ చౌహన్ మాట్లాడుతూ మానవాళికి మేలు చేసే ఔషధాలు అందాలంటే ప్రభుత్వాలతో పాటు పరిశ్రమల సహకారం అవసరమన్నారు. దీర్ఘకాలం పట్టే ఔషధ అధ్యయనాలకు ప్రారంభంలో జంతువులపై ప్రయోగాలు కీలకమన్నారు.

లాసా జాతీయ అధ్యక్షుడు, సిఎస్ఐఆర్ శాస్త్రవేత్త డాక్టర్ విజయపాల్‌సింగ్ మాట్లాడుతూ ఔషధ పరిశోధనలలో భాగంగా శాస్త్రవేత్తలు జంతువులపై జరిపే పరిశోధనలకు దేశంలో లేబొరేటరీ ఎనిమల్ సైంటిస్ట్స్ అసోసియేషన్ (లాసా) క్రియాశీల పాత్రపోషిస్తోందన్నారు. దేశంలో దాదాపు 1300 మంది శాస్త్రవేత్తలు . ప్రస్తుతం లాసాలో జీవిత సభ్యులుగా ఉన్నారని తెలిపారు. ఏటా దేశవ్యాప్తంగా లాసా వార్షిక సదస్సులను, సమావేశాలను నిర్వహిస్తూ యువ శాస్త్రవేత్తలను ప్రోత్సహిస్తున్నామనిన్నారు. లాసా ఉపాధ్యక్షుడు డాక్టర్ జె.మహేష్‌కుమార్ మాట్లాడుతూ జంతువులపై స్వదేశీ పరిజ్ఞానంతో పరిశోధనలు జరపడానికి లాసా ప్రోత్సాహం అందిస్తున్నామన్నారు. సమావేశాల కమిటి చైర్మన్ ప్రొఫెసర్ ఎల్.శ్రీనివాస్ మాట్లాడుతూ సమావేశాలలో ప్రయోగాత్మక లాబొరేటరీ ఎనిమల్ సైన్స్‌లో తాజా, ఆధునిక ఆవిష్కరణలపై చర్చించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గీతం ప్రోవైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు, జిమ్‌సర్ ప్రోవైస్ ఛాన్సలర్ డాక్టర్ బి.గీతాంజలి, కార్యదర్శి డాక్టర్ ఆర్‌కె.శక్తి దేవన్, నిర్వాహక కార్యదర్శి డాక్టర్ జి.సుహసిన్, కన్వీనర్లు డాక్టర్ నేమాని హరిశంకర్, డాక్టర్ నితిన్ యాదవ్ సమక్షంలో అంతర్జాతీయ సమావేశాల బుక్‌లెట్‌ను ఆవిష్కరించారు. సమావేశాలలో తమిళనాడు వెటర్నరీ పాథాలజిస్ట్ ప్రొఫెసర్ సి.బాలచంద్రన్‌కు లాసా జీవితకాల సాఫల్య పురస్కారాన్ని అందజేశారు ఉత్తమ పరిశోధకులుగా డాక్టర్ ముత్తుకుమార్, డాక్టర్ మహేష్ సహరీలకు అవార్డులను అందజేశారు.

## నేడు అంబులెన్స్‌లు ప్రారంభం

**ప్రజాశక్తి-పాడేరు:** అల్లూరి జిల్లా పాడేరు ఏజెన్సీకి కొత్తగా 10 అంబులెన్సులు మంజూరైనట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కృష్ణమూర్తి నాయక్ వెల్లడించారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, అల్లూరి జిల్లాలోని రోగులకు సకాలంలో మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ఈ నూతన అంబులెన్స్‌లు అందుబాటులోకి రానున్నాయన్నారు. ఈ అంబులెన్సులు విశాఖపట్నం పార్లమెంట్ సభ్యులు, రాజ్యసభ సభ్యులు డాక్టర్ వి.విజయసాయి రెడ్డి సౌజన్యంతో సమకూరాయని తెలిపారు. ఈ వాహనాలను ఈనెల 20న శనివారం ఉదయం 10 గంటలకు పాడేరులో ఐటీడీఏ కార్యాలయం వద్ద అరకు పార్లమెంట్ సభ్యురాలు గుమ్మ తనుజరాణి ప్రారంభించనున్నారని తెలిపారు.

## కూటమి ప్రభుత్వం క్రెడిట్ చోరీ

**ప్రజాశక్తి- సీతమ్మధార :** రాష్ట్రంలోకూటమి ప్రభుత్వం మరో క్రెడిట్ చోరీకి పాల్పడుతుందని వైసిపి ఐటి విభాగం విశాఖ అధ్యక్షులు మెరువ గణేష్ అసహనం వ్యక్తం చేశారు. జగన్ నేతృత్వంలోని వైసిపి ప్రభుత్వం 2022 నవంబర్‌లో నోటిఫికేషన్ ల్ జారీ చేసి 6100 పోలీస్ కానిస్టేబుల్ పోస్టులు భర్తీ ప్రక్రియ ప్రారంభించి, 2023 జనవరిలో ప్రిలిమ్స్ నిర్వహించాన్నారు. తర్వాత ఎన్నికలు, కోర్టు కేసులు వంటి కారణాలు ఆ ప్రక్రియ ఆగిపోతే, ఇటీవల దాన్ని కొనసాగించిన కూటమి ప్రభుత్వం 5757 మంది ఎంపికైన కానిస్టేబుల్ అభ్యర్థులకు ఈనెల 16వన మంగళగిరిలో సీఎం చంద్రబాబు నియామక పత్రాలను అందజేశారన్నారు. ఈసందర్భంగా ఉద్యోగాలన్నీ తామే ఇచ్చినట్లుగా చంద్రబాబు ప్రభుత్వం గొప్పలు చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు

## నేరాలు ఘోరాలు

### భార్య హంతకునికి జీవిత ఖైదు

**ప్రజాశక్తి- విశాఖ లీగల్ :** స్వల్ప ఘర్షణలో కట్టుకున్న భార్యను అతి కిరాతకంగా చంపిన నిందితునికి జీవిత ఖైదు విధిస్తూ నగరంలోని మహిళా కోర్ట్ న్యాయమూర్తి వి.శ్రీనివాసరావు తీర్పునిచ్చారు. జైలు శిక్షతోపాటు రూ.20వేలు జరిమానా విధించారు. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా 6 నెలలు సాధారణ జైలు శిక్ష అనుభవించాలని న్యాయమూర్తి తీర్పులో స్పష్టం చేశారు.

జిల్లా కోర్టు ఇంచార్జ్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ పిఎస్ నాయుడు అందించిన .వివరాలివి. అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి మండలం సమ్మగుల పంచాయతీ తెప్ప గరువు ప్రాంతానికి చెందిన నిందితుడు మధురం ఫోను సాగిన బాబురావుతో15 ఏళ్ల క్రితంసాగిన కరణమ్మ తో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమార్తెలు. 2017 ఏప్రిల్ 4న ఉదయం బాబురావు భార్య చిన్న కుమార్తెతో అడవిలోకి కట్టెలు కొట్టడానికి వెళ్లారు. తిరిగొచ్చాక భార్యను డబ్బులు అడగ్గా, మద్యం తాగేస్తాడని భావించి డబ్బులు ఇవ్వడానికి నిరాకరించింది. దీంతో కోపోద్రిక్తుడైన బాబురావు తన వద్ద ఉన్న కత్తితో భార్యను ఎడమవైపు మెడపై బలంగా కొట్టడంతో ఆమె అక్కడికక్కడే ప్రాణం వదిలింది. మృతురాలి సోదరుడు చిట్టిబాబు ఫిర్యాదు మేరకు ఎ.అన్నవరం పోలీసులు నిందితులపై కేసు నమోదు చేశారు. అప్పటి సిఐలు వై గోవిందరావు, చంద్రశేఖం రావులు కేసు దర్యాప్తు చేసి నేరాభియోగ పత్రాన్ని దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పై విధంగా తీర్పునిచ్చారు.

## స్టీల్‌ప్లాంట్‌లో స్వల్ప అగ్ని ప్రమాదం

**ప్రజాశక్తి-ఉక్కునగరం :** విశాఖ స్టీల్ ప్లాంట్‌లో శుక్రవారం స్వల్ప అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. స్టీల్ మెల్టింగ్ షాప్ పరిధిలోని డంపింగ్ యార్డులో ఏర్పాటు చేసిన టిఎలొసి వ్యర్థాల ప్రాసెసింగ్ యూనిట్‌లో ఈ ఘటన జరిగింది. శుక్రవారం ఉదయం ప్లాంట్‌లో అకస్మాత్తుగా మంటలు చెలరేగడంతో కార్మికులు అప్రమత్తమయ్యారు. సమాచారం అందుకున్న వెంటనే స్టీల ప్లాంట్ ఫైర్ సర్వీస్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను పూర్తిగా అదుపులోకి తీసుకువచ్చారు.

ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. అగ్ని ప్రమాదం చిన్నదేనని, ఉత్పత్తి కార్యకలాపాలకు అంతరాయం కలగలేదని ప్లాంట్ యాజమాన్యం తెలిపింది. భద్రతా నిబంధనల ప్రకారం వెంటనే చర్యలు తీసుకుని ప్రమాదం పెరగకుండా నియంత్రించగలిగామని వెల్లడించారు. ప్రమాదానికి కారణాలపై అంతర్గత విచారణ చేపట్టామని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అదనపు భద్రతా చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

## సిఐటియు అఖిల భారత మహాసభను జయప్రదం చేయండి

**ప్రజాశక్తి-దుంబ్రిగుడ:** - సిఐటియు అఖిలభారత మహాసభను జయప్రదం చేయాలని అల్లూరి జిల్లా సిఐటియు ఉపాధ్యక్షుడు ఎస్.బి పోతురాజు పిలుపునిచ్చారు. ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, వచ్చేనెల 4న విశాఖపట్నంలో అఖిల భారత మహాసభను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.అరకు వారపుసంతలో శుక్రవారం ప్రచారం చేశారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తోందని చెప్పారు. కార్మిక చట్టాలను తొలగించి నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొని వచ్చి పనిభారం పెంచిందని చెప్పారు. బడా పెట్టుబడి దారులకు అనుకూలమైన చట్టాలు అమలు చేసి, కార్పొరేట్ కంపెనీలకు దోచిపెట్టడమే పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో గసబ మాజీ సర్పంచ్ పాంగి. సురేష్ కుమార్, వార్డ్ మెంబర్ పాంగి. సత్యనారాయణ, సీఐటీయూ నాయకులు పాంగి. డొంబు, పాంగి. మోహన్ దాస్, కేశవరావు, తదితరులు పాల్గొన్నారు.




ప్రచారం చేస్తున్న సిపిఎం నాయకులు

## 21న అమరవీరుల సంస్మరణ సభను జయప్రదం చేయండి

**ప్రజాశక్తి-వి.ఆర్.పురం:** ఈ నెల 21న చింతూరులో జరిగే అమరవీరుల సంస్మరణ సభను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సున్నం రాజులు కోరారు. శుక్రవారం మండలంలోని నాగేంద్రపురంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. మండల కార్యదర్శి పులి సంతోష్‌కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పలు త్యాగాలు చేసి పోరాటాల్లో అమరులైన అమరవీరుల సంస్మరణ సభను జయప్రదం చేయాలని కోరారు.. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు పోడియం శ్రీరామమూర్తి, కారం సత్తిబాబు, తుర్రం బాబురావు, మీడియం సీతయ్య, మొట్టం.గంగరాజు గ్రామస్తులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎటిడబ్ల్యూఒ క్రాంతికుమార్

## మఠంభీమవరం ఆశ్రమ పాఠశాల తనిఖీ

**ప్రజాశక్తి-కొయ్యూరు:** మండలంలోని మారుమూల మఠంభీమవరం పంచాయతీ మఠంభీమవరం జీటిడబ్ల్యూఎఎస్ బాలుర ఆశ్రమ పాఠశాలను శుక్రవారం ఎటిడబ్ల్యూఒ క్రాంతికుమార్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థుల హాజరు, బోధనా విధానం, వసతి సౌకర్యాలు, భోజన నాణ్యత, పరిశుభ్రత వంటి అంశాలను సమగ్రంగా పరిశీలించారు. విద్యార్థులకు అందుతున్న సదుపాయాలపై క్రాంతికుమార్ ఆరా తీసారు. నాణ్యమైన విద్యతో పాటు క్రమశిక్షణను మరింత బలోపేతం చేయాలని సూచించారు. పాఠశాల పరిసరాల శుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, విద్యార్థుల భద్రతకు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.

## నేడు విశాఖలో కెటిఎం 'ఆరెంజ్ ఎక్స్‌పి-160'

**ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ:** ప్రపంచ ప్రఖ్యాత ప్రీమియం మోటార్‌సైకిల్ బ్రాండ్ కేటీఎం, తన సరికొత్త 'కేటీఎం 160 డ్యూక్' సామర్థ్యాన్ని ప్రదర్శించేం దుకు 'ఆరెంజ్ ఎక్స్‌పీ-160' అనే వినూత్న కార్యక్రమాన్ని విశాఖపట్నంలో శనివారం నిర్వహించనుంది. సాధారణ రోడ్లపై కాకుండా, ప్రత్యేకంగా రూపొం దించిన ట్రాక్‌పై ఈ బైక్‌ను టెస్ట్ రైడ్ చేసే అద్భుతమైన అవకాశాన్ని కంపెనీ కల్పిస్తోందని బజాజ్ ఆటో లిమిటెడ్ (ప్రొ-బైకింగ్) ప్రెసిడెంట్ మానిక్ నాంగియా తెలిపారు. ఈ ప్రదర్శనలో భాగంగా గో-కార్ట్ ట్రాక్‌లపై నిపుణులైన రైడర్‌ల మార్గదర్శకత్వంలో వినియోగదారులు బైక్‌ను నడపవచ్చునని కేవలం రైడింగ్ మాత్రమే కాకుండా కార్నరింగ్, బ్రేకింగ్, థ్రాటిల్ కంట్రోల్ వంటి రేసింగ్ నైపుణ్యాలను కేటీఎం నిపుణులు ఇక్కడ నేర్పిస్తారని తెలిపారు. ఈ బైక్ 164.2 సిసి లిక్విడ్-కూల్డ్ ఇంజిన్ కలిగి ఇది 19 పిఎస్ గరిష్ట శక్తిని, 15.5 ఎన్ ఎం టార్క్‌ను అందిస్తూ అత్యుత్తమ పనితీరును కనబరుస్తుంది. యువతను ఆకట్టుకునే అగ్రెసివ్ డిజైన్ దీని ప్రత్యేకత అన్నారు.

# కుట్టుశిక్షణతో మహిళలకు ఆర్థిక స్వావలంబన

### సిఆర్‌పిఎఫ్ ద్వితీయ ఇన్‌కమాండెంట్ మహేంద్రహెగ్డే

**ప్రజాశక్తి -సీలేరు:** మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు కుట్టు శిక్షణ ఉపయోగపడుతుందని సిఆర్‌పిఎఫ్ ద్వితీయ ఇన్‌కమాండెంట్ మహేంద్రహెగ్డే అన్నారు. జికె వీధి మండలం సీలేరు పోలీస్‌స్టేషన్ సిఆర్‌పిఎఫ్ క్యాంపులో సివిక్ యాక్షన్ ప్రోగ్రాంలో భాగంగా కుట్టుమిషన్ శిక్షణ కేంద్రాన్ని శుక్రవారం లాంఛనంగా ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శిక్షణకు అర్హులైన 22 మందికి ఎంపిక చేయడం జరిగిందన్నారు. వారందరికీ సుమారు 20 రోజులపాటు శిక్షణ అందిస్తారన్నారు. అనంతరం ఎంపికైన మహిళా లబ్ధిదారులకు ఉచితంగా కుట్టు మిషన్లు అందజేస్తామన్నారు. కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శిక్షణలో ప్రావీణ్యత పొంది పదిమంది యూనిట్ గా తయారై క్లాత్ కొనుగోలు చేసి మీరే సొంతంగా స్కూలు యూనిఫారాలు తదితర దుస్తులు తయారుచేసి షాపులకి విక్రయించి ఉపాధి పొందవచ్చున్నారు. ఇప్పటికే స్థానిక పోలీస్ స్టేషన్ పరిధి మారుమూల గిరిజన గ్రామాల్లో సిఆర్పిఎఫ్ సివిక్ యాక్షన్ ప్రోగ్రాంలో భాగంగా మంచినీటి కుళాయిలు, విద్యుత్ సదుపాయం లేని గిరిజన గ్రామాలకి చార్జింగ్ లైట్లు వ్యవసాయ పనిముట్లు అందిస్తున్నట్టు గుర్తు చేశారు. మరిన్ని కార్యక్రమాలు చేపడతామన్నారు. హోమియో వైద్యాధికారి సృజనారాయ్ ఎంపిటిసి పిల్లా సాంబమూర్తి, సర్పంచ్ పాంగి దుర్గో జ్యోతి ప్రజ్వలన చేసారు. కార్యక్రమంలో టిఆర్పిఎఫ్ 42 బెటాలియన్ కమాండెంట్ ఎస్‌హెచ్ ధర్మ ప్రకాష్ సిఆర్పి పోలీసులు, పిహెచ్‌సి హెచ్ఎస్ త్రినాధ పాల్గొన్నారు.



శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సిఆర్‌పిఎఫ్ కమాండెంట్ మహేంద్రహెగ్డే

# చట్టాల అమలులో ప్రజాప్రతినిధుల పాత్ర కీలకం



మాట్లాడుతున్న ఎంపిపి బడుగు రమేష్

**ప్రజాశక్తి- కొయ్యూరు :** చట్టాలను అమలు చేయడంలో ప్రజాప్రతినిధుల పాత్ర ఎంతో కీలకమని ఎంపిపి బడుగు రమేష్ అన్నారు. కొయ్యూరు మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో గిరిజన హక్కులు-చట్టాలపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ పీసా చట్టం, అటవీ హక్కుల చట్టం సహా పలు కీలక చట్టాలపై వివరించారు. పంచాయితీ కార్యదర్శులు, ఎంపీటీసీలు, సర్పంచులు, పీసా కమిటీ సభ్యులు పాల్గొన్నారు. గిరిజనుల హక్కులు, గ్రామ పాలనలో వారి భాగస్వామ్యం, చట్టాల ద్వారా లభించే ప్రయోజనాలపై పీసా ఎంఒటి అవగాహన కల్పించారు. గ్రామాల్లో కొనసాగుతున్న నాటుసారా తయారీ, వినియోగాన్ని పూర్తిగా నిర్మూలించేందుకు కృషి చేయాలని సూచించారు. నాటుసారా వల్ల కలిగే ఆరోగ్య, సామాజిక దుష్పరిణామాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. అనుమతులు లేకుండా జరిగే మైనింగ్, అక్రమ తవ్వకాలు వంటి కార్యకలాపాలకు పీసా కమిటీ సభ్యులు ఎట్టి పరిస్థితుల్లోనూ సంతకాలు పెట్టవద్దని, గిరిజన భూములు, అటవీ సంపద పరిరక్షణలో అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. పీసా చట్టానికి విరుద్ధంగా జరిగే చర్యలను గ్రామస్థాయిలోనే అడ్డుకోవాలని సూచించారు. గ్రామ సభల నిర్వహణ విధానం, గిరిజన ప్రాంతాల్లో అమలు కావాల్సిన ప్రభుత్వ పథకాలు, అభివద్ధి కార్యక్రమాల్లో పీసా కమిటీల కీలక పాత్రపై సమావేశంలో వివరించారు.

# పల్స్‌పోలియోను విజయవంతం చేయండి

**ప్రజాశక్తి -అడ్డతీగల :** ఎంపిడిఒ కార్యాలయంలో డిసెంబర్ 21న నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతం చేయాలని ఎంపిడిఒ కుమార్ ఆదేశించారు. శుక్రవారం పంచాయతీ కార్యదర్శులు, ఐసిడిఎస్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్స్ పోలియో కార్యక్రమానికి సంబంధించి అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఏ ఏ గ్రామాల్లో పల్స్ పోలియో బూత్‌లు ఏర్పాటు చేస్తున్నారో అక్కడ పంచాయతీ అధికారులు తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. ముందురోజే దీనికి సంబంధించి దండోరా వేయించాలన్నారు. మండలంలో మొత్తం 81 సెంటర్లు వద్ద పల్స్ పోలియో చుక్కలు వేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమం 3 రోజులు జరుగుతుందన్నారు. మొదటి రోజు సెంటర్స్ వద్ద తర్వాత రెండు రోజులు డోర్ టు డోర్ సర్వే చేసి పోలియో చుక్కలు వేయడం జరుగుతుందన్నారు. ం లో తమ క షి అందిస్తామని మండల విద్యాశాఖాధికారి వారు చెప్పడం జరిగింది. కార్యక్రమంలో తహశీల్దార్ దొరకయ్య, ఎంఇఒ శ్రీనివాస్ , దుప్పులపాలెం వైద్యాధికారి స్పందన, ఎల్లవరం వైద్యాధికారి దేవీ ప్రియాంక, డిప్యూటీ ఎంపిడిఓ గణేష్ బాబు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ కుమార్



సన్మానిస్తున్న మన్యపుత్ర యువజన సంఘం సభ్యులు, హెచ్‌ఎం శ్రీను

## కానిస్టేబుళ్లుగా ఎంపికైన యువకులకు సన్మానం

**ప్రజాశక్తి- జికే వీధి :** మండలంలోని రింతాడ మన్యపుత్ర యువజన సంఘం ఆధ్వర్యంలో సివిల్ కానిస్టేబుల్ ఉద్యోగం సాధించిన పాంగి సత్యనారాయణ,, గుంట కృష్ణ కిషోర్‌ను స్థానిక సర్పంచ్ బొబ్బిలి లక్ష్మి, పాఠశాల హెచ్‌ఎం మన్యపుత్ర యువజన సంఘ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఉప సర్పంచ్ సోమేష్ కుమార్ మాట్లాడుతూ పంచాయతీకి చెందిన ఇద్దరు యువకులు సివిల్ కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపికవడం అభినందనీయమన్నారు. వీరిద్దరూఎన్నో కష్టాలు పడి ఉద్యోగం సాధించారని యువత వీరిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మన్యపుత్ర యువజన సంఘం అధ్యక్షుడు సోమేశ్ కుమార్(ఉప సర్పంచ్),సంఘ కార్యదర్శి రాజేష్ కుమార్ (పీసా కార్యదర్శి), పాఠశాల హెచ్‌ంఎ శ్రీను,చంద్రశేఖర్, గ్రామ పెద్దలు రాజేశ్వరి, ఉద్యోగం సాధించిన వారి తల్లిదండ్రులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛాంధ్ర -సర్ణాంధ్ర పక్కాగా నిర్వహించాలి

### కలెక్టర్ హరేంధిర ప్రసాద్

**ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ :** ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో స్వచ్ఛాంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమాలను పక్కాగా నిర్వహించాలని కలెక్టర్ హరేంధిరప్రసాద్ అధికారులను ఆదేశించారు. ఈ నెల మూడో శనివారం (20 తేదీ) జిల్లాలో 'పర్యావరణంలో అవకాశాలు' అంశంపై విస్తృత కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో భాగంగా పట్టణ స్థానిక సంస్థలు, పరిశ్రమ భాగస్వాములు, రీసైక్లర్లు, ప్రొడ్యూసర్ రెస్పాన్సిబిలిటీ ఆర్గనైజేషన్లు, స్టార్టప్‌లు తదితర సంస్థల నిర్వాహకులతో కలిసి నెట్‌వర్కింగ్ ఈవెంట్లు నిర్వహించాలన్నారు. స్వయం సహాయక సంఘాలు, స్టార్టప్‌లు, స్థానిక వ్యాపారులు అభివృద్ధి చేసిన రీసైకిల్, అప్‌సైకిల్, పర్యావరణహిత ఉత్పత్తులను ప్రదర్శించాలన్నారు. అదేవిధంగా బయోగ్యాస్ ప్లాంట్లు, బయోఎంజైమ్ తయారీ యూనిట్లు, కంపోస్టర్లు,రీసైకిల్ టైల్స్, ఇంధన బ్రికెట్లు వంటి వ్యర్థాల నుంచి సంపద తయారీ,సాంకేతిక పరిజ్ఞానాలపై ప్రదర్శనలు ఏర్పాటు చేయాలని సూచిం చారు. కార్యక్రమాల్లో అన్ని జిల్లా, జోనల్ అధికారుల భాగస్వామ్యం తప్పనిసరిగా ఉండాలని ఆదేశించారు. జిల్లా స్థాయిలో పర్యవేక్షణ, నివేదికల సమర్పణకు చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్‌ను నోడల్ అధికారిగా నియమించినట్లు కలెక్టర్ తెలిపారు.

## ఇగ్నోలో అడ్మిషన్లు ప్రారంభం

**ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ:** ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) జనవరి 2026 విద్యాసంవత్సరానికి గానూ వివిధ దూరవిద్యా కోర్సులతో పాటూ ఆన్‌లైన్ కోర్సుల్లో ప్రవేశాల కోసం ప్రకటన జారీ చేసింది. అన్ని సర్టిఫికేట్, డిప్లొమా, పిజి డిప్లొమా, డిగ్రీ, పీజీ కోర్సుల్లో ప్రవేశాలు జనవరి 31, 2026 వరకు లభిస్తాయి. ఈ అడ్మిషన్లు ఆన్ లైన్ ద్వారా పొందాల్సి ఉంటుంది. ఇగ్నో వెబ్సైట్‌లో ఉన్న అడ్మిషన్ల లింక్ ద్వారా లేదా కింద ఇవ్వబడిన లింక్ ద్వారా అడ్మిషన్లు పొందవచ్చు. https://ignouadmission.samarth.edu.in/ 2026 విద్యా సంవత్సరానికి గాను శ్రీకాకుళంలోని డాక్టర్ బి ఆర్. అంబేద్కర్ విశ్వవిద్యాలయం, ఎచ్చెర్లలో ఉన్న అధ్యయన కేంద్రాన్ని పున్ణ ప్రారంభించడానికి ఏర్పాట్లు చేశారు. అల్లూరి జిల్లా పాడేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల లో కూడా కొత్త అధ్యయన కేంద్రం ప్రారంభానికి ఏర్పాట్లు జరిగాయి. కోర్సులలో ప్రవేశాలకు గడువుతేదీ జనవరి 31, 2026. విశాఖపట్నం ప్రాంతీయకేంద్రం పరిధిలోని 11 జిల్లాల్లో ఉన్న అధ్యయన కేంద్రాలన్నిటిలో ప్రవేశాలు పొందే వీలుంది. ఫీజులు కూడా ఆన్లైన్ ద్వారానే కట్టాల్సి ఉంటుంది. ఎస్సీ, ఎస్టి విద్యార్థుల కోసం 50 శాతం ఫీజు రాయితీకూడా కల్పిస్తోంది.